# గేదె పోయింది

జనమంచి రామకృష్ణ

"**అయ్యగారూ!** మన గేదె ఇంటికి రాలేదు, బాబూ! వెతికి వెతికి ఆఖరికి ఇంటికొచ్చేసిందేమో నని గొడ్లసాల్లో సూస్తే సిసబోయి ఉంది, బాబయ్యా" అంటూ మంత్రిగారి పాలేరాడు వెంకన్న భోరున ఏడుస్తూ నిలబడ్డాడు.

"దాన్ని అంటిపెట్టుకునే ఉండరా అని ఎన్ని సార్లు చెప్పినా వినవుగా! ఎక్కడికి పోయిందో ఏమో! దేవుళ్ళనీ, మనుషులనీ ఎత్తుకు పోతూన్న వాళ్ళు పశువుల్ని ఒదులుతారా? అందులో మన గేదె మీద ఎందరు కళ్ళేశారని!"

"బాబూ! రావుడు లేడండీ?"

"ఎవడోలే భీముడు! ఏమైంది? వాడి మీద అనుమానమా? చెప్పరా? పోలీసులకి ఫోనుచేసి వెధవని బొక్కలో తోయిస్తా."

"కాదు, బాబయ్యా! ఆడి రెండు మేకపిల్లల్ని ఎవరో వచ్చి సిమిట్‌లో ఆటోలో ఎక్కించుకు పారిపోయార్ట!"

"మన గేదె మేకపిల్ల కాదు గదరా ఆటోలో ఎక్కించుకు పోవడానికి? ... వెంకన్నా! పార్థసారధిని ఇలా రమ్మను."

"సిత్తం, బాబయ్యా."

"ఏం లేదు, పార్థసారదీ! మేత కెళ్ళిన మన గేదె ఇంటి కింతవరకూ రాలేదని పాలేరాడు నెత్తీ నోరూ బాదుకుని ఏడుస్తున్నాడు. పోలీసులకి ఫోను చెయ్యి తర్వాత. రేడియో స్టేషను డైరెక్టరుకి మన గేదె తప్పిపోయినట్లు చెప్తూ వివరాలన్నీ ఇయ్యి. రేడియోలో వెంటనే జరుగుతూన్న కార్యక్రమాన్ని ఆపి ఈ ప్రకటన చేయించమను."

"ఎస్, సార్!"

మంత్రిగారి పి.ఎ. పార్థసారధి రేడియో స్టేషను డైరెక్టరుకి ఫోనుచేసి గేదె వివరాలు ఇచ్చాడు.

"ఆకాశవాణి—ఒక ముఖ్యప్రకటన మన మంత్రి గారి గేదె పోయింది. మేతకి వెళ్ళిన గేదె తిరిగి సాయంత్రానికి ఇల్లు చేరుకోలేదు. పాలేరాళ్ళూ, కార్యవర్గులూ, పశు సంవర్ధక శాఖ వారూ, మంత్రి గారి ఆశ్రితులూ, హితులూ, శ్రేయోభిలాషులూ—అందరూ వలుమూలలా గాలించారు. ప్రయోజనం లేకపోయింది. మంత్రిగారు పనులన్నీ మానుకుని ఒకసారి బెంగతో, మరొక సారి ఉగ్రరూపంలో ఉన్నారు. పోయిన గేదె వివరాలు: పొట్టిగా, కురచగా ఉంటుంది. గచ్చకాయ కళ్ళు. వాడి కొమ్ములు. తోక అంత పొట్టీ కాదు, పొడుగూ కాదు. తోక చివర వెంట్రుకల కుచ్చు తెలతెల్లగా ఉంటుంది. మాంచి ఛవిగా నడుస్తుంది. ఆచూకీ తెలిపినా, పట్టుకు తీసుకొచ్చి అప్పజెప్పినా మంత్రిగారు తృణమో పణమో ముట్టచెబుతారు ... ప్రకటన సమాప్తం. తర్వాత కార్యక్రమం వెంటనే ప్రారంభ మవుతుంది."

పార్థసారధికి దూరదర్శన్ కేంద్రం డైరెక్టరు దగ్గిరనించి ఫోనొచ్చింది.

"ఎస్! అవునండి! పార్థసారధినే! బాగున్నారా, డైరెక్టరుగారూ!"

"నేను బాగానే ఉన్నాను సరే! ఇప్పుడే రేడియోలో ఒక విషాద వార్త విన్నాను. ఏమిటి? మంత్రిగారి గేదె పోయిందట! ఎలా పోయిందండి? మంత్రిగారి గేదెను ఎవరు దొంగిలించి ఉంటారు?"

"అదే తెలియడం లేదు. పోలీసులు కూడా నిద్రాహారాలు లేకుండా గాలిస్తున్నారు."

"ఒక పని చేస్తే మంచిదండి. రేడియోలో గేదె వివరాలు చెప్పించా రనుకోండి. దూరదర్శన్‌లో గేదె ఫోటో చూపిస్తూ వివరాలు చెప్పడమే కాకుండా, మంత్రిగారు స్వయంగా ప్రజలకు ఒక విజ్ఞప్తి చేస్తే బాగుంటుం దనుకుంటాను. మంత్రిగారికి ఈ సలహా ఇచ్చి చూడండి! ఆయన 'ఊఁ' అంటే నేను అన్ని ఏర్పాట్లూ చేస్తాను."

"సరే! మీది మంచి సూచనండీ, డైరెక్టరు గారూ! మీ కెందుకు? మీరు అన్ని ఏర్పాట్లూ చేయించండి. నేను మంత్రిగారిని తీసుకొస్తా."

పార్థసారధి మంత్రిగారి దగ్గరి కెళ్ళి దూరదర్శన్ డైరెక్టరు చేసిన సూచన విన్నవించుకున్నాడు. మంత్రిగారి వదనార విందంలో మందహాసం తళుక్కుమంది.

"పార్థసారదీ! నకు తోచనేలేదసుమ్మా! దూరదర్శన్‌లో మన గేదె కలర్ ఫోటో చూపిద్దాము—పదు."

మంత్రిగారి పి. ఎ. పార్థసారధితో దూరదర్శన్ కేంద్రానికి వెళ్ళగానే దూరదర్శన్ సిబ్బంది స్వాగతం పలుకుతూ ఎక్కడలేని సానుభూతి ప్రకటించారు.

"ఈ నాటి కార్యక్రమాలు ప్రారంభమయే ముందు, వారి గేదె పోయిన సందర్భంలో మంత్రి గారు ప్రజలకు విజ్ఞప్తి సందేశ మిస్తారు."

"మిత్రులారా! మేము చాలా విచారగ్రస్తులమై ఉన్నాము. మా ముద్దుల గేదె మామూలుగా ఉదయమే మేతకు వెళ్ళింది. ఇంతవరకూ ఇల్లు చేరలేదు. దానికీ మాలాగా, మీలాగా టి. వి. చూడడం అలవాటు. దానికోసం ప్రత్యేకంగా గొడ్లసాలలో ఒక టి. వి. సెట్టును అమర్చాముకూడా. దూరదర్శన్ కార్యక్రమాలు జనరంజకమే కాకుండా పశురంజకంగా ఉంటున్నాయంటే దూరదర్శన్ అధికారులను మన మెంతైనా అభినందించాల్సిందే!

అసలు విషయాని కొద్దాము. ఇందాకా విన్న వించుకున్నాను విషాద వార్త మా గేదె తప్పిపోయింది. ఇది ప్రతిపక్షం వాళ్ళు కక్షతో చేసిన పనే. అంతగా వారికి మాపై, మా పార్టీపై కక్ష ఉంటే మేము బలాబలాలు చూసుకుందుకు సంసిద్ధులమై ఉన్నాము. ఒక నోరు లేని జంతువు మీద పగ సాధించడం చేతకానితనమే అంటాను. ఇదిగో—ఈ కలర్ ఫోటోలో ఉన్నదే మా గేదె. ఎనౌన్సరూ! గేదె గురించి నాతో పరిచయం కానీ..."

"నమస్కారం, మంత్రిగారూ."

"ఊఁ."

"తమ గేదె పోయినందుకు దూరదర్శన్ కేంద్రం తరఫున మా సానుభూతి."

"దూరదర్శన్ ప్రేక్షకులకు మా గేదె వివరాలు చెప్పండి."

"ఈ ఫోటోలో కనిపిస్తున్నదే మన మంత్రిగారి గేదె. కలర్‌లో ఎంత అందంగా ఉందో చూశారా! అందుకే మన కేంద్ర మంత్రిగారు కలర్ టి. వి. వల్ల .."

"నాకు పైమవుతూంది. గేదె గురించి వివరాలు త్వరగా వర్ణించవయ్యా!"

"ఈ ఫోటోలో ఉన్న గేదె మన మంత్రిగారిది... మంత్రిగారూ! కర్రతో గేదె కళ్ళు చూపించండి."

మంత్రిగారు గేదె కళ్ళు చూపించగానే --

"అవి మంత్రిగారి గేదె కళ్ళు. అవి గచ్చకాయ రంగు కళ్ళు ... ఆఁ—అడక్కుండానే మంత్రిగారు దయతో కొమ్ములు చూపిస్తున్నారు. చూశారా ఆ కొమ్ములు ఎంత వాడిగా ఉన్నాయో! అయినా మంత్రిగారి గేదె పరమ సాధువు. ఇక ... తోక ... అంత పొడుగూ కాదు, అంత పొట్టీ కాదు. తోక చివరి వెంట్రుకల కుచ్చు తెలతెల్లగా ఉంటుంది. మంత్రి గారి గేదె మాంచి ఛవిగా ఉంటుంది. పొట్టిగా, కురచగా ఉంటుంది. అయ్యా మంత్రిగారూ! పాలు..."

"ఏడు లీటర్లిస్తుంది."

"మంత్రిగారి గేదె ఏడులీటర్ల పాలిస్తుంది..."

"మహాజనులారా! గేదెగురించి ఆచూకీ తెలిపినా, పట్టి తెచ్చి ఇచ్చినా మేము మాంచి పారితోషిక మిస్తాము."

ఇంతలో ఎవరో సౌంజ్ఞ చేయగానే ఎనౌన్సరు లోపలికెళ్ళి చీటీ తెచ్చి మంత్రి గారికి సమర్పించాడు. మంత్రిగారు చదువుకుని చికాకుపడ్డారు.

"క్షమించాలి మంత్రిగారూ! గేదె దొరికిన సమాచారమా?"

విసుక్కుంటూ, "కాదు. ఏముంది! మీటింగుకి టైమైందని. అవును, రెండు గంట లాలస్యమైంది. అంతేగా. గేదెపోయి నేను విచారంలో ఉంటే మీటింగుకి ఆలస్యమైందని ఎందు కలా ఇదై పోతారో! ... అబ్బాయ్, ఎనౌన్సరూ! వస్తా! జైహింద్!"

పి. ఎ. ను వెంట తీసుకుని మంత్రిగారు మీటింగుకి వెళ్ళారు.

"మహాజనులారా! త్వరగా రావాలనే అనుకున్నాను, ప్రయత్నించాను కూడా. తీరా బయల్దేరబోతూండగా మా పాలేరాడు— 'బాబూ! మన గేదె మేత కెళ్ళి తిరిగి ఇంటికి రాలేదయ్యా' అని భోరున ఏడుస్తూ నా కాళ్ళ మీద పడ్డాడు. ఆ విషాద కారణం వల్ల రావడానికి కొంచెం ఆలస్యమైంది.

ఇకపోతే వికలాంగుల సంవత్సరం పురస్కరించుకుని ఎన్నో రకాలుగా వికలాంగులకు పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం ఎంతో కృషి సలుపు

"ఇది పురాణ కాలక్షేపం కాదు. చెక్కభజనలు చేయడానికీ మన మిక్కడ సమావేశ మవలేదు. ప్రభుత్వ పరిపాలన విధానాల గురించీ, బలహీన వర్గాల, పేద సాదల, అల్ప సంఖ్యాకుల ఉద్ధరణ గురించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాము. క్లిష్టమైన పథకాలకు చర్చల ద్వారా రూపకల్పన చేయడానికి సమావేశమైనాము అని తమకు ప్రతిపక్ష సభ్యులకు హెచ్చరిక చేస్తున్నాను."

"ప్రభుత్వం వారు చేసే వాగ్దానాలు ప్రతి నిత్యం సభల్లో, సమావేశాల్లో వింటున్నాము. ఇప్పుడు మహా భారత గాథలోని ఉత్తర గోగ్రహణం కథ ప్రస్తుత పరిస్థితుల కన్వయించేలా కొంచెం మార్చి చెబుతాను. సావధానంగా వినమని గౌరవ నీయ సభ్యులను కోరుతున్నాను. నే చెప్పే ముచ్చటైన కథలో గోవు బదులు గేదె ఉంటుంది. అది గోగ్రహణమైతే ఇది మహిషి గ్రహణం" అని పరంధామయ్య అనగానే చప్పట్లు మిన్ను ముట్టాయి.

"సభాపతీ! మన మంత్రిగారి పూర్వ గాథ బట్ట బయలైంది. ఆయన మంత్రి కాక పూర్వం పాలిచ్చే పశువులను మందీ మార్బలంతో దొంగిలించే వారు."

"ఎవరు? ఎవరు" అంటూ సభ్యులు కోపంగా ప్రశ్నల వర్షం కురిపించారు.

"కాస్త ఓపిక పట్టండి. ఆ అద్భుతమైన అర్హతతో వారు ఈ వేళ మంత్రి అయి కూర్చున్నారు. ఈ మహా మంత్రులు తమ గేదె పోయిందని ఒక బక్కచిక్కిన అల్పసంఖ్యాక వర్గానికి చెందిన సత్తార్ సాయిబు గేదెను తమదని వారి గొడ్ల పాకలో కట్టేంచు కున్నారు. వాడు ఏడుస్తూ, నెత్తి నోరూ బాదు కుంటూ చేసిన ఫిర్యాదు ఎవరూ ఖాతరు చేయలేదు. ఎవరు ఖాతరు చేస్తారు చెప్పండి! కంచే చేను మేస్తే, కాపేమి చేయగలడు? ఇలాగ మన ప్రభుత్వం వారు అపారమైన సేవ చేస్తున్నారు" అని పరంధామయ్య గ్లాసుడు మంచినీళ్ళు తాగాడు.

"పేరు చెప్పకుండా సభనే అపఖ్యాతి పాలు చేయడం మంచిది కా" దని సభాపతి హెచ్చరించారు.

"గేదె సొంత విషయం. సొంత విషయాలను సభలో చర్చించడానికి వీలు లేదు. నేను అభ్యంతరం చెబుతూనా ను" అని పాలక పక్ష సభ్యుడు అభ్యంతరం లేవదీశాడు.

"కొంత కాలం క్రితం ఒక పోలీసు ఉన్నతాధికారి రిటైరయేముందు తన తరవాత చార్జి తీసుకునే ఆఫీసరుకి జాగ్రత్తగా ఉండమని ప్రస్తుతం మంత్రిగా ఉంటూన్న ఆయన గురించి హితవు నలుపు తెలుపులో పెట్టి పదవీ విరమణ చేశారు."

"సిగ్గు! సిగ్గు! ఎవ రా మంత్రి" అని ప్రతిపక్ష సభ్యులు కేకలు పెట్టారు.

"డౌన్! డౌన్! ప్రతిపక్షం!"

"ఈ విషయం ప్రివిలేజస్ కమిటీకి రెఫర్ చేయాలి. పరంధామయ్యగారు ఆ మంత్రి పేరు చెప్పాలి!"

"సభాపతి అనుమతిస్తే తప్పక ఆయన నామ ధేయం విన్నవించుకుంటాను."

సభాపతికూడా పరంధామయ్య పైన ఆగ్రహం చెందారు.

"ఆధారాలు లేకుండా పేరు చెప్పకుండా ఇంత తీవ్రమైన అపవాదు వేయడానికి నేను అభ్యంతరం చెబుతున్నాను."

"అయ్యా, సభాపతీ! ఆ పోలీసు స్టేషను రికార్డులో ఉన్న వివరాలు ఇలా ఉన్నాయి: ఫలానా వ్యక్తి చాలా పేరు మోసిన పశువుల దొంగ. ఇప్పుడు మంత్రిగా పనిచేస్తున్నారు. మంత్రి కావడం వల్ల పశువుల దొంగతనాలను గురించి ఇప్పు డెక్కువగా ఫిర్యాదులు రావడం లేదు. ఈయన మంత్రి అనడం ఆ విధంగా మంచిదే. అయినా కూడా ఈ మనిషి మీద ఒక కన్ను వేసి ఉంచాల్సిందే."

పాలక పక్ష సభ్యులు ఆ మంత్రి పేరు చెప్పి తీరాలని పట్టు పట్టారు.

పరంధామయ్య "సభాపతీ, ఈ కార్యకలాపాల అనంతరంనేను తమ ఛేంబరుకు వచ్చి అన్ని షయూలూ విన్నవించుకుంటాను" అన్నాడు.

సభాపతి నవ్వుతూ "ఈ లోకోక్తి విన్నారా! వెను కటి గుణమేల మాను వినురా సుమతీ!" అన్నారు.


★


# యన్.టి. ఆర్. రాజకీయాల పరిశీలన

ప్రతి ఒక్క ఓటరూ చదివితీరవలసిన 'వ్యాసపీఠం'

## నటరత్న: మక్కళ్ తిలకం: రామాయణంలో పిడకల వేట

రచన: నాటి "ఆంధ్రప్రభ శాస్త్రి"




* బుక్ సెల్లర్లకు 25% కమీషన్.
* ఒక కాపీ రిజిస్టర్డ్ పోస్టు ఖర్చు రు. 3/50లు-అదనం.

For trade terms, contact
**Cards Crafts Classics**
8 State Bank Street, P.B. No 2421, Madras-600 002.
Grams: "GREETCARDS" Phone: 83792

ధర: రు. 3/-

SA/B/01